ఆంక్షలు.. అడ్డంకులు..

- ఆందోళనలో సంత వ్యాపారులు
- రోడ్ల వెంబడి దుకాణాలకు నో పర్మిషన్
- సౌకర్యాలు కల్పించని మున్సిపల్ అధికారులు
- అవస్థలు పడుతున్న రైతులు, వ్యాపారులు



మట్టి నేలతో సంత లోపలి ప్రాంతం

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీ ఆదాయంపై అధికారులు దృష్టి సారించడం లేదు. పట్టణ పరిధిలో చాలా వరకు మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే మార్గాలు ఎన్నో ఉన్నాయి. కానీ వాటిని సద్వినియోగం చేసుకునేందుకు పాలకవర్గం కానీ, మున్సిపల్ అధికారులు కాని అడుగు ముందుకు వేయడం లేదు. ప్రతివారం ఆదాయం వచ్చే వారపు సంత వేలంపాటను గత సంవత్సరం మే నెలలో నిర్వహించాల్సి ఉండగా, ఇంత వరకు ఆ ఊసే లేదు. హెడ్డాఫీసు ఏరియాలో ప్రతివారం వారపు సంత జరుగుతుంటుంది. అయితే సంవత్సరాల తరబడిగా ప్రతి ఆదివారం చిరు వ్యాపారులు జాతీయ రహదారి రోడ్డుపై ఫుట్‌పాత్ ప్రాంతంలో తాత్కాలికంగా ఒక్కరోజుకు దుకాణాలు ఏర్పాటు చేసుకొని కూరగాయలు, వివిధ రకాల ప్లాస్టిక్ సామగ్రి, మొక్కలు, ఉల్లిపాయల వంటి దుకాణాలు ఏర్పాటు చేసుకొని రాత్రి వరకు కూడా అమ్ముకుని వెళ్లిపోతున్నారు. అయితే గత వారం ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఏర్పాడుతోందని, రోడ్డుకు ఇరువైపుల ఏర్పాటు చేసిన దుకాణాలను వన్‌టౌన్ పోలీసులు తొలగించి, సంత లోపలి ప్రాంతంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అయితే ఈ వారం కూడా ముందస్తుగా వన్‌టౌన్ పోలీసులు, వ్యాపారులను శనివారం సంత ప్రాంతానికి పిలిపించి చర్చలు జరిపారు. మున్సిపల్ అధికారులతో మాట్లాడి తగిన సౌకర్యాలు కలుగజేస్తామని పోలీసులు హామీ ఇచ్చారు.

మట్టితో ఉన్న ప్లాట్‌ఫాంపై వ్యాపారం ఎలా...

హెడ్డాఫీసు ఏరియాలోని వారపు సంత రోడ్డులో వ్యాపారాలపై పోలీసులు ఆంక్షలు విధించడంతో ఇబ్బంది పడుతున్నామని వ్యాపారులు చెబుతున్నారు. ట్రాఫిక్ సమస్య, రోడ్డుపై రద్దీ ఉండడం వలన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నప్పటికీ ఏళ్ల తరబడిగా నడిచిన వ్యాపారాలకు అడ్డంకులు సరికాదని వాపోతున్నారు. సంత లోపలి ప్రాంతం అంతా మట్టితోనే ఉంది. ఎటువంటి సౌకర్యాలు లేవు. ఆ నెలపైనే ప్లాస్టిక్ పట్టాలు వేసుకుని వ్యాపారం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సౌకర్యాలు కల్పిస్తామని పోలీసులు హామీ ఇచ్చారు. దీంతోపాటు ప్రతి వ్యాపారికి పర్మనెంట్ స్థలం కొరకు వారికి నంబర్లు సైతం కేటాయిస్తామని చెప్పారు. ఇది జరిగితే చిరు వ్యాపారులకు మేలు జరుగుతుంది. అయితే సంతలో ప్రతివారం రాత్రి వరకు వ్యాపారం జరుగుతూ ఉంటుంది. కానీ సంతలో విద్యుత్, మంచినీరు, టాయిలెట్స్ సౌకర్యాలు లేకపోవడం వలన వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంతకు వేలంపాట నిర్వహించి సౌకర్యాలను మెరుగుపర్చాల్సి ఉంది. మున్సిపల్ అధికారులు వేలంపాట నిర్వహించకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారో ఎవరికీ తెలియని విషయం. ఇప్పటికైనా వేలంపాటను నిర్వహించి, మున్సిపాలిటీకి ఆదాయం సమకూరే విధంగా అధికారులు చర్యలు పలువురు వ్యాపారులు, స్థానికులు కోరుతున్నారు.



ఫుట్‌పాత్‌పై కూరగాయల దుకాణం

సౌకర్యాలు కల్పించాలి..



కొత్తగూడెంలోని వారపు సంతలో ప్రతివారం కూరగాయలు అమ్ముతుంటాను. నాలాగా చాలామంది ఉన్నారు. ఎండ, వాన, గాలికి తట్టుకొని వ్యాపారం చేసుకుంటున్నం. సంతలో వ్యాపారాలు సరిగా జరగడానికి మున్సిపల్ అధికారులు మౌలిక వసతులు కల్పించాలి.

– అజ్మీర లక్ష్మణ్, చిరు వ్యాపారి

ప్లాట్‌ఫామ్‌లు నిర్మించాలి..



సంతకు వచ్చే వినియోగదారులు, వ్యాపారుల కొరకు టాయిలెట్స్ నిర్మించాలి. దీంతో పాటుగా రాత్రి సమయంలో కూడా వ్యాపారం నడిచేందుకు గానూ విద్యుత్ సౌకర్యం తప్పనిసరి. సంతలో మట్టి నెలపైనే వ్యాపారాలు చేయాల్సి వస్తోంది. ప్లాట్‌ఫామ్‌లు నిర్మించాలి.

– బానోత్ రాములు, చిరు వ్యాపారి

టీపీయూఎస్ క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

జూలూరుపాడు: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను శనివారం జూలూరుపాడు హైస్కూల్‌లో యూనియన్ జిల్లా జనరల్ సెక్రటరీ బోడా కృష్ణ, హైస్కూల్ హెచ్ఎం టి.లక్ష్మీనర్సయ్య, సీనియర్ ఉపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని, డీఏ, పీఆర్‌సీలను ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురుమూర్తి, రామనాథం, పటేల్, ఉమామహేశ్వరి, లలిత, సరోజని, పీడీ అరుణ పాల్గొన్నారు.

22న సెలవు ప్రకటించండి

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 22న అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా కోలిండియా మాదిరిగా సింగరేణిలో కూడా సెలవు ప్రకటించాలని బీఎంఎస్ జాతీయ నాయకుడు పి.మాధవ నాయక్ యాజమాన్యాన్ని విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అనుసరించి కోలిండియాలో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల వరకు సెలవును ప్రకటించారని, సింగరేణిలో కూడా సెలవు ప్రకటించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రానికి భవనం మంజూరు చేయాలి

జూలూరుపాడు: వెంగన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రానికి భవనం మంజూరు చేయాలని బీఎస్పీ నాయకుడు తంబర్ల నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జూలూరుపాడులో మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేక స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చిన్న గదిలో నడుస్తోందన్నారు. దీంతో చిన్నారులు, టీచర్ ఇబ్బంది పడుతున్నారని, సరుకులు, సామగ్రి పెట్టుకోవడానికి సరిపోవడం లేదన్నారు. నేలాల సూర్య ప్రకాష్, కాకటి వెంకట్ పాల్గొన్నారు.

ఎస్పీకి శుభాకాంక్షలు



ఎస్పీకి మెమెంటో అందిస్తున్న జగన్ తదితరులు

కొత్తగూడెంరూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజును పీఏసీఎస్ వైస్ చైర్మన్ కూచిపూడి జగన్, హేమచంద్రపురం సర్పంచ్ బండ వెంకటేశ్వర్లు, గోలి శ్రీను, సురేష్, నాగేష్, విజయ్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. మెమెంటో ఇచ్చి, శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఓటరు నమోదు శిబిరాల తనిఖీ



బీఎల్ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్ శారద

జూలూరుపాడు: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జూలూరుపాడు తహసీల్దార్ శారద అన్నారు. మండలంలోని పోలింగ్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను తహసీల్దార్ శారద శనివారం తనిఖీ చేశారు. ఓటరు నమోదు వివరాలను బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. శనివారం మొదటి రోజు 51 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో కొత్తగా ఓటు హక్కు కోసం 10, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు కోసం 40 దరఖాస్తులు రాగా, డెత్‌కు సంబంధించిన దరఖాస్తు ఒకటి వచ్చిందన్నారు. బీఎల్ఓ సూపర్‌వైజర్ ఎం.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీక్



పైపులైన్ లీకేజీతో ఏర్పడిన గుంత

ఇల్లెందు: పట్టణంలోని బుగ్గవాగు, రైల్వే బ్రిడ్జి సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకయింది. నీటి తాకిడికి రోడ్డు కొట్టుకపోయి సొరంగంలా తయారయింది. అక్కడ ప్రధాన రహదారి పక్కనున్న షాపులు, ఇళ్లలోకి నీరు చేరింది. కొంతకాలంగా బుగ్గవాగు, రైల్వే బ్రిడ్జి వద్ద మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకులు ఏర్పడుతున్నాయి. లీకైనప్పుడల్లా స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు శాశ్వత మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కొత్తగూడెంఅర్బన్: మున్సిపాలిటీ పరిధి మేదరబస్తీలోని శ్రీ రాగా హైస్కూల్‌లో విద్యార్థులకు, త్రీటౌన్ పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పోలీసులు మాట్లాడుతూ.. సెల్‌ఫోన్‌ను విపరీతంగా వాడుతూ తెలియకుండా కొన్ని లింక్‌లను క్లిక్ చేయడం వలన సైబర్ నేరాలు జరుగుతున్నాయని వివరించారు. ఎవరికైనా అలా జరిగితే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి చెబితే 24 గంటల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు. స్టూడెంట్స్ కూడా వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్‌లలో చాటింగుల వలన ఎన్నో అనర్థాలు జరుగుతూ జీవితాలు పాడవుతున్నాయని చెప్పారు. విద్యార్థులు సెల్‌ఫోన్స్‌కు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణ, హెయిర్ స్టైల్, యూనిఫాం గురించి వివరించారు. అనంతరం స్కూల్ కరస్పాండెంట్ మాల్లారపు వరప్రసాద్ మాట్లాడుతూ... ఇలాంటి కార్యక్రమాల వలన పిల్లల్లో జీవితం, చదువు పట్ల అవగాహన కలుగుతుందని, ఇలాంటి కార్యక్రమాలు ఎక్కువగా నిర్వహించాలన్నారు. పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు రాంబాబు, ప్రభాకర్, కౌసర్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

జూలూరుపాడు: రెవెన్యూ అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఎంపీడీఓ, తహసీల్దార్‌లకు గాంధీనగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సుంకర శ్రీనివాసరావు ఫిర్యాదు చేశాడు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అడ్మిట్ అయినట్లు చెప్పాడు. బీఎల్ఓ సూపర్ వైజర్, గిర్దావర్ తిరుపతిరావు తనకు ఫోన్ చేసి దురుసుగా మాట్లాడారని, బీఎల్ఓ డ్యూటీ ఉందని చెప్పాడన్నారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అక్షింతలు పంపిణీ



టేకులపల్లి: అక్షింతలతో బయలుదేరిన ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు



పాల్వంచరూరల్: తోగ్గూడెంలో ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

టేకులపల్లి: ఈనెల 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభం, రాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను మండలంలోని గ్రామాల్లో గడపగడపకు పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం కోయగూడెంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, రామభక్తులు రాముని అక్షింతలను ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతులమీదుగా ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనెం ఉమ, ఎంపీటీసీ జాల సంధ్య, గోపాలకృష్ణ, రాజేశ్వరరావు, పూనెం సురేందర్, జాల మురళి, బోడ పూన్యా పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను భజరంగదళ్ సంస్థ నిర్వాహకులు శనివారం తోగ్గూడెం గ్రామంలో ఊరేగింపుగా ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లింబానాయక్, శ్రీను, జర్పుల రాంబాబు, బోడ శంకర్‌స్వామి, రాజు, రామ్మూర్తి, గుగులోతు సాయికుమార్, అజ్మీర రాజేష్, బుర్ర చిన్నబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్దెలకు ఎన్‌టీఆర్ అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న శివకుమార్

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెంకు చెందిన కళాకారుడు, కవి మద్దెల శివకుమార్‌కు ఎన్‌టీఆర్ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో తాజాగా జరిగిన సమావేశంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, చంద్రతేజాలయ సంయుక్త ఆధ్వర్యాన ఆయనకు అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో మామిడి హరికృష్ణ, తాళ్లూరి వాసురావు తదితరులు పాల్గొనగా, శివకుమార్‌ను పలువురు అభినందించారు.

జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సుజాతనగర్: మండలంలోని మూడు పాఠశాలలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు ఈనెల 22న కొత్తగూడెంలో జరిగే జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికయ్యారు. సింగభూపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మహాత్మా జ్యోతిభాపూలే గురుకులం, సుజాతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు చొప్పున విద్యార్థులు ఎంపిక కాగా శనివారం వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

'స్టాచ్యూ ఆఫ్ సోషల్ జస్టిస్' హర్షణీయం

సింగరేణి(కొత్తగూడెం): పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో ఏర్పాటు చేయడం అభినందనీయం అని సింగరేణి కాలరీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అన్నారు. శుక్రవారం వారు అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు విజయవాడ వెళ్లి వచ్చారు. శనివారం కొత్తగూడెంలో విలేకరులతో మాట్లాడుతూ... అంబేద్కర్ విగ్రహానికి స్టాచ్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ అని పేరు పెట్టడం హర్షణీయం అన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపినట్లు పేర్కొన్నారు. ఆంతోటి నాగేశ్వరరావు, గోనే శ్రీకాంత్, మందా హనుమంతరావు, జిమ్మిడి మల్లేష్, వంగపండ్ల సుమన్ పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి



మాట్లాడుతున్న సీతారాంనాయక్

పాల్వంచరూరల్: గ్రామపంచాయతీల అభివృద్ధికి పంచాయతీ పాలకులు ముందుగా ప్రణాళికలను రూపొందించుకుని సభలో తీర్మానాలు అమోదింపజేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి సీతారాంనాయక్ సూచించారు. తోగ్గూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని ప్రణాళికలపై ఆరా తీశారు. పంచాయతీలో రూ.10లక్షల అంచనాల వ్యయంతో యాక్షన్ ప్లాన్ తీర్మానాన్ని ఆమోదించారు.

టిప్పర్ డ్రైవర్ల కమిటీ ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులు నరేష్, వీరభద్రం

టేకులపల్లి: సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా అనుబంధ తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ (బి 2540) ఆధ్వర్యంలో శనివారం సేవాలాల్ గుడిలో టిప్పర్ డ్రైవర్ల జనరల్ బాడీ జరిగింది. తొమ్మిది మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న, జిల్లా నేత జర్పుల సుందర్ తెలిపారు. అధ్యక్షుడిగా లకావత్ నరేష్, ఉపాధ్యక్షుడిగా రాజేశ్వరరావు, కార్యదర్శిగా వీరభద్రం, సహాయ కార్యదర్శి మదార్, కోశాధికారిగా బానోతు రఘు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రవీందర్, కార్యవర్గ సభ్యులుగా రామకోటి, కోటేష్, చంటిలను ఎన్నుకున్నారు.

విమానం చక్కర్లు

ఇల్లెందు: రెండు రోజులుగా ఇల్లెందు మీదుగా ఓ విమానం చక్కర్లు కొడుతోంది. తక్కువ ఎత్తులో ప్రతీ గంటకోసారి డోర్నకల్ వైపు నుంచి ఇల్లెందు మీదుగా బోడు వైపునకు ఇది వెళ్తున్నట్లు ప్రజలు చెబుతున్నారు. కాగా, ఈ విమానం అటవీశాఖకు చెందినదిగా కొందరు చెబుతుండగా, సీతారామ ప్రాజెక్టు పరిశీలన నిమిత్తం అధికారులు పర్యటిస్తున్నారని మరో ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై పోలీసులు కానీ ఇతర శాఖల అధికారులు కానీ స్పష్టత ఇవ్వలేకపోతున్నారు.

జీవహింస మహాపాపం..



ర్యాలీ నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులు

పాల్వంచ: అందరూ ధ్యానంపై దృష్టి మళ్లించాలని, శాకాహారమే మహాభాగ్యం అని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎస్.హనుమంతరావు అన్నారు. శనివారం పాల్వంచలోని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ధ్యానం, శాకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హనుమంతరావు మాట్లాడుతూ.. ధ్యానంతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, సంకల్పసిద్ధి, ఆత్మవిశ్వాసం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనేక రుగ్మతలు దూరమై ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. భూమిపై ప్రతి జీవి రక్షించబడాలని, ప్రతి మనిషి ఒక బుద్ధుడు కావాలన్నారు. జీవహింస మహాపాపం.. ఏ జీవినీ చంపే హక్కు లేదన్నారు. మానువులు ఆచరించాలిన మహోన్నతమైన ధర్మం అహింస అన్నారు. కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకులు శైలజ, రమేష్, స్నేహలత, రాఘవ, శరత్, రామ కోటమ్మ, కుసుమ, సరస్వతి, జయశ్రీ, సుజాత, గౌరి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకు ఇబ్బంది కలగనివ్వకండి..

సింగరేణి(కొత్తగూడెం): వారపు సంతలో చిరువ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి కొచ్చెర్ల జోసెఫ్ పోలీసు అధికారులను కోరారు. ట్రాఫిక్ సమస్యతో సంతరోజు రోడ్డుపై వ్యాపారాలు నిషేధించడంతో వ్యాపారులు నష్టపోయే పరిస్థితి ఉంటుందన్నారు. శనివారం సంత ప్రాంతాన్ని సందర్శించి వ్యాపారులను సమస్యలు అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. సానుకూలంగా స్పందించిన వన్‌టౌన్ సీఐ కరుణాకర్ మాట్లాడుతూ... వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా సరిహద్దులో వ్యాపారాలు చేసుకోవాల సూచించారు.

జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలి



భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని తదితరులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియాలో అమలవుతున్న హైపవర్ వేతనాలను లేదా జీఓ నంబర్ 22 ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికులను దశలవారీగా పర్మనెంట్ చేయాలని, 2022లో 18 రోజుల పాటు చేసిన సమ్మె కాలంలో అగ్రిమెంట్‌లోని పెండింగ్ అంశాలను వెంటనే అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లిస్తున్న బోనస్‌ను 20శాతానికి పెంచాలని, సింగరేణి సంస్థ వార్షిక లాభాల నుంచి కార్మికులకు వాటా చెల్లించాలని పేర్కొన్నారు. నర్సరీ కార్మికులకు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించి సీఎంపీఎఫ్ అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన భట్టి పరిష్కార మార్గం చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్, మిరియాల రంగయ్య, సారయ్య, కే.వీరభద్రయ్య, బుర్ర తిరుపతి, ఎండీ అక్బర్ అలీ, బెల్లంపల్లి అఫ్రోజ్ ఖాన్, యర్రగాని కృష్ణయ్య పాల్గొన్నారు.

'పీఎం విశ్వకర్మ' ఆన్‌లైన్ సెంటర్ ప్రారంభం



ఆన్‌లైన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు

చుంచుపల్లి: గాంధీ కాలనీలో పీఎం విశ్వకర్మ యోజన పథకం కోసం ఆన్‌లైన్ సెంటర్‌ను శనివారం నుంచి అందుబాటులోకి తెచ్చినట్లు విశ్వకర్మ పథకం జిల్లా స్క్రీనింగ్ కమిటీ మెంబర్ బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు గౌడ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అన్ని కుల వృత్తుల వారికి చేయూతనివ్వడం కోసం నరేంద్ర మోదీ పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. 70 ఏళ్లలో భారతదేశంలో ఏనాడూ కులవృత్తులను గుర్తించలేదని, మోదీ సారథ్యంలో అన్నివర్గాలను గుర్తించి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ టి.నరేంద్రబాబు, రాయుడు నాగేశ్వరరావు, వల్లపు సాయిరాం, రంగు లక్ష్మణాచారి, అపర్ణ, పెద్దోజు మల్లచారి, భవాని, రామకృష్ణ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే కేసులు పెట్టడం అన్యాయం



నిరసన తెలుపుతున్న నాయకులు

కొత్తగూడెంటౌన్: జిల్లాలోని వైద్యశాఖలో అవినీతి జరుగుతోందని పోరాటం చేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేష్‌నాయక్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయడం అన్యాయమని సంఘం జిల్లా అధ్యక్షుడు కేశవ్‌నాయక్ అన్నారు. శనివారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. కేశవ్‌నాయక్ మాట్లాడుతూ... వైద్యశాఖలో గిరిజనులకు అన్యాయం జరుగుతోందని ఆందోళన చేస్తున్నామన్నారు. అవినీతి ఆరోపణలకు సమాధానం చెప్పకుండా ప్రశ్నించిన రాజేష్‌నాయక్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయడం అన్యాయం అన్నారు. ఏజెన్సీ చట్టాలు, గిరిజనులకు అన్ని హక్కులు దక్కాలని పోరాటం చేస్తున్నామని, న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదన్నారు. కేసును ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మోహన్‌నాయక్, కాశీరాంనాయక్, లావుడ్యా ప్రసాద్‌నాయక్, లకావత్ నాగేశ్వరావు, కృష్ణనాయక్, కిషన్‌లాల్, రాందాస్ రాథోడ్, శంకర్‌నాయక్, హతీరాంనాయక్, సంధ్యానాయక్, రమేష్‌నాయక్, గణేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల కళాశాలలో ప్రవేశాలు

ఇల్లెందు: ప్రభుత్వ మైనార్టీ గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ముద్దసిర్ హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధన కాలేజీలో నడుస్తున్న తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీలో 40 సీట్లు ఉన్నాయని, 30 మైనార్టీ, బీసీలకు 5, ఎస్సీ 2, ఎస్టీ 2, ఓసీలకు ఒక సీటు ఉందన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి గాను వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 986628674 నంబరులో సంప్రదించాలని కోరారు.

5వ తరగతిలో ప్రవేశం..

ఇల్లెందులోని మైనార్టీ గురుకులంలో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 80 సీట్లు ఉన్నాయని, 51 మంది ముస్లింలు, ఐదుగురు క్రిస్టియన్లు, జైనులు, పార్సీ, బౌద్ధులు, సిక్కులకు ఒక్కో సీటు, ఐదుగురు ఎస్సీలు, ముగ్గురు ఎస్టీలు, పదిమంది బీసీలు, ఇద్దరు ఓసీలకు అవకాశం ఉందని తెలిపారు. వివరాలకు 9110360408 నంబలో సంప్రదించాలని కోరారు.

రేపు సింగరేణి కార్యాలయం ఎదుట ధర్నా



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థకు సేవలందించిన మాజీ కార్మికుల పట్ల యాజమాన్యం, ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, మాజీ కార్మికులకు సౌకర్యాలు కల్పించటంలో వివక్ష చూపున్నారని, ఈనేపథ్యంలో ఈనెల 22న సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నామని సింగరేణి రిటైర్డ్ కార్మికులు తెలిపారు. శనివారం కొత్తగూడెంలోని యూనియన్ కార్యాలయంలో వారు మాట్లాడారు. సింగరేణి సంస్థ మాజీ అధికారులకు కల్పిస్తున్న సౌకర్యాలు మాజీ కార్మికులకు కల్పించటం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు, సింగరేణి ఉద్యోగులు, కార్మికుల పెన్షన్‌లో తీవ్ర వ్యత్యాసం ఉందన్నారు. ఇప్పటికే రూ.200 లోపు పెన్షన్ తీసుకునే మాజీ కార్మికులు ఉన్నట్లు చెప్పారు. ప్రతి మూడేళ్లకోసారి పెన్షన్ విధానంపై సమీక్షించాలని డిమాండ్ చేశారు. అధికారులతో సమానంగా సీపీఆర్ఎంఎస్ రూ.25 లక్షలకు పెంచి మాజీ కార్మిక కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ కార్మికులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. దమ్మాలపాటి శేషయ్య, వంగా వెంకట్, జే.గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.